# మనసాక్షి

25-08-2026

BREAKING EDITION




# ప్రజల భద్రత విషయంలో రాజీ పడొద్దు..!

- రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి
- అధికారులు తరచుగా తనిఖీలు నిర్వహించాలి
- ప్రమాదకర లొకేషన్లు గుర్తించండి
- రోడ్డు సైడ్ ఫ్లెక్సీలు, హోర్డింగుల విషయమై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి
- హిట్ అండ్ రన్ కేసుల విషయంలో బాధితులకు పరిహారం అందించాలి
- కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ ఆగస్టు 25, మనసాక్షి :**

ప్రజల భద్రత విషయంలో రాజీ పడొద్దని రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్ పర్సన్ గా కలెక్టర్ మాట్లాడారు. అధికారులు ప్రధాన రహదారులను తరచుగా తనిఖీలు చేస్తూ ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీసీ ప్యాచ్ వర్క్ లు, మేజర్ అప్రోచ్ రోడ్డు పనులు, రద్దీ ప్రాంతాల్లో ఓపెన్ డ్రైనేజీ తదితర సమస్యల గురించి చర్చించారు. ఆర్ఓబి వంతెన వద్ద సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్పొరేషన్ పరిధిలో సర్కిల్ వారీగా తనిఖీలు చేస్తూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. రోడ్ సైడ్ ఫ్లెక్సీలు హోల్డింగ్ల విషయమై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి.. నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించారు. హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి బాధితులకు వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. రానున్న గణేష్ ఉత్సవాలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.



అనంతరం సీపీ గౌస్ అలం మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాలు, ఈ చలాన్లు, హిట్ అండ్ రన్ కేసుల విషయాలు వివరించారు. ఈ సమావేశంలో రవాణా శాఖ అధికారులు, పోలీస్, వైద్య, మున్సిపల్, అగ్నిమాపక శాఖ, ఆర్అండ్ బీ, ఎన్ హెచ్ఏఐతో పాటు వివిధశాఖల అధికారులు, ఆర్టిఏ మెంబెర్ పడాల రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## మూసి పునరుజ్జీవనకు...

# భూసేకరణ వేగవంతం చేయాలి

**హైదరాబాద్, మన సాక్షి**

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు కోసం అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణకు ల్యాండ్ పూలింగ్ విషయంలో స్పష్టమైన విధానం రూపొందించాలని చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌పై ముఖ్యమంత్రి ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ఫేజ్-2 కి వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని చెప్పారు. భూసేకరణ ప్రక్రియలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణకు స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని అన్నారు. ఇందులో న్యాయపరమైన ఎలాంటి చిక్కులు రాకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. మూసీ రివర్‌ఫ్రంట్‌లో భాగంగా చేపట్టే ప్రాజెక్టులకు అతి తక్కువ వడ్డీకి రుణ సదుపాయాలపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించాలని, అలాగే టీడీఆర్‌లు జారీ చేసే విషయంలో కూడా ప్రతి వారం సమీక్షించాలని చెప్పారు. గండిపేట మంచిరేవుల సమీపంలోని ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి తక్షణం టెండర్లు పిలవాలని ఆదేశించారు. అలాగే, కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, ఎంఆర్డీసీఎల్ ఎండీ, జేఎండీ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల 27 న వార్డు సభలు



**గోదావరిఖని, ఆగస్టు 25 మన సాక్షి**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( సర్ ) కు సంబంధించి ఈ నెల 27 వ తేదీన వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ తెలిపారు. ఈ మేరకు వార్డు అధికారులు , వార్డు సహాయకులు , బి ఎల్ ఓ సూపర్ వైజర్లతో ఎన్ టి పి సి మిలినియం హాల్ లో మంగళ వారం సన్నాహక సమావేశం నిర్వహిశించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముసాయిదా జాబితాలో ఉన్న ఓటర్ల పేర్లు చదవడం , ముసాయిదాపై అభ్యంతరాలు , ఫారం నెం . 6, 7 , 8 స్వీకరించడం కొరకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఆదేశాలననుసరించి ఈ వార్డు సభలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. రామగుండం నియోజకవర్గ పరిధిలో 2, 13, 990 ఓటర్లకు 1, 83, 233 ఓటర్ల పేర్లు మాత్రమే ముసాయిదా లో ప్రకటించిన నేపథ్యంలో పెద్ద ఎత్తున అభ్యంతరాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. నో మ్యాపింగ్ కింద 5500 మందికి , అనామలీస్ కింద 49, 034 మందికి నోటీసులు జారీ చేసి వారి వద్ద నుండి అవసరమైన ధృవీకరణ పత్రాలు తీసుకోవాలని అన్నారు. నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేసి అర్హత ఉన్న ఏ ఒక్క ఓటర్ కూడా జాబితా నుండి తప్పి పోకుండా జాగ్రత్త పడాలని అన్నారు. నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , రామగుండం , అంతర్గాం , పాల కుర్తి మండలాల తహశీల్దార్ లు రవీందర్ , ప్రసాద్ , సునీత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో ప్రైవేటు సత్రంలో ఐదుగురు ఆత్మహత్య..!

**మన సాక్షి, వెబ్ డెస్క్:**

శ్రీశైలం పుణ్యక్షేత్రం వద్ద తీవ్ర విషాద ఘటన నెలకొన్నది. అక్కడ ప్రైవేట్ సత్రంలో ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ముగ్గురు మహిళలు ఒక పురుషుడుతో పాటు 15 ఏళ్ల బాలుడు కూడా ఉన్నాడు. రెండు మూడు రోజులుగా గది తలుపులు తీయకుండా బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన సత్రం నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో ఆత్మకూరు డిఎస్పి రామాంజి ఆధ్వర్యంలో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని తలుపులు తెరిచి పరిశీలించారు. కాగా గదిలో ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుంది. ఆత్మహత్యకు పాల్పడిన వారిలో మృతులు ఆదిలక్ష్మి (50), మల్లేశ్వరి (45) సుధాకర్ (36), శ్రీదేవి(33) మణికంఠ (15) గా గుర్తించారు. కాగా ప్రాథమిక దర్యాప్తులో మృతులు సత్యసాయి జిల్లా బత్తలపాలెం వాసులుగా గుర్తించారు. ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడడానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

# 8.26 కోట్లతో డైట్ కళాశాల ప్రారంభం



మహబూబ్ నగర్ జిల్లా మనసాక్షి ఆగస్టు 25

పాలమూరు అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు ఎంపి డికె అరుణ నూతనంగా నిర్మించిన డైట్ కళాశాల భవనాన్ని ఆమె ప్రభుత్వ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దాదాపు 22,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన నూతన భవనంలో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబొరేటరీ, డిజిటల్ ల్యాబ్, ఆధునిక తరగతి గదులు, సెమినార్ హాల్,అకడమిక్ బ్లాక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, లైబ్రరీ, స్పెషలైజ్డ్ ఎడ్యుకేషన్ యూనిట్స్ తదితర ఆధునిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. డైట్ కళాశాలను ఆధునిక సదుపాయాలతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేయడం ద్వారా చారిత్రక విద్యా సంస్థకు పునర్వైభవం కల్పించామని అన్నారు. 1964లో ప్రారంభమైన డైట్ కళాశాల రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగిన సంస్థ అని, నాణ్యమైన ఉపాధ్యాయులను తయారు చేయడంతో పాటు వారికి శిక్షణ అందించి నిష్ణాతులైన ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దే బాధ్యతను ఈ సంస్థ నిర్వర్తిస్తోందని అన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు లాగా ఓట్ల కోసం కాకుండా సమాజానికి ఉపయోగపడే సంస్థలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కళాశాల అభివృద్ధికి చర్యలు చేపట్టామని తెలిపారు.ఎంపీ డీకే అరుణ కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సమగ్ర శిక్షా అభియాన్ కింద డైట్ కళాశాలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ ఏడాది జనవరిలో శంకుస్థాపన చేసిన నూతన భవనాన్ని కేవలం కొన్ని నెలల్లోనే పూర్తి చేసి ఆగస్టు 25న ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు.దాదాపు 100 కంప్యూటర్లు ఏర్పాటు చేసుకునే సామర్థ్యంతో ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్‌ను నిర్మించామని, ప్రస్తుతం సుమారు 60 కంప్యూటర్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మిగిలిన కంప్యూటర్లను కూడా త్వరలో సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కోసం కేంద్ర ప్రభుత్వం, సమగ్ర శిక్షా ద్వారా సుమారు రూ. 8.26 కోట్ల నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే యన్నెం శ్రీనివాసరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కళాశాలను మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సూచించిన మేరకు ఇంకా అవసరమైన అదనపు కంప్యూటర్లు, విద్యార్థిలకు అదనపు టాయిలెట్లు, విద్యా పరికరాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవసరమైన అదనపు మౌలిక వసతులను కూడా సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో అవసరాలను వంద శాతం పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం స్టేట్ హోంలో వన మహోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత, మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు మేగ్యా నాయక్, తిరుమల వెంకటేష్, ప్రశాంత్, రమేష్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మేరాజ్ ఉల్లాఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# హత్యకు గురైన గిరిజన దంపతుల కుటుంబానికి ప్రభుత్వ అండ..

- బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ.
- బాధిత కుటుంబానికి అట్రాసిటీ కేసు పరిహారం ఉత్తర్వులు అందజేత

**సూర్యాపేట( మోతె ) ఆగస్టు 25 మనసాక్షి**



మోతే మండలం బిక్యా తండాకు చెందిన భార్య, భర్తలు నాగులు, బుబా ఇటీవల దారుణ హత్యకు గురైన సందర్భంగా దంపతుల కుటుంబ సభ్యులకు జిల్లా యంత్రాంగం పూర్తి అండగా ఉంటుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ భరోసా కల్పించారు. మంగళవారం వారు స్వయంగా బిక్యా తండాలోని బాధిత దంపతుల నివాసానికి వెళ్లి, వారి కుమార్తెలు జ్యోతి, సంధ్యలను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పరంగా అట్రాసిటీ కేసు కింద రావాల్సిన ఆర్థిక సహాయంలో మొదటి విడతగా 50 శాతం 4.2 లక్షలు నగదును బాధితుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపి, అందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ఉత్తర్వులను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ ఇలాంటి ఘోరమైన సంఘటన జరగడం అత్యంత బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పడానికి మరియు జిల్లా యంత్రాంగం వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇవ్వడానికే తాము ఇక్కడికి వచ్చామని పేర్కొన్నారు. ఈ కేసులో పోలీసులు ప్రతి చిన్న ఆధారాన్ని అత్యంత నిశితంగా సేకరిస్తున్నారని, చార్జ్‌షీట్‌ను త్వరగా సిద్ధం చేసి కోర్టుకు పంపుతామని చెప్పారు. నేరస్థులకు వీలైనంత త్వరగా కఠిన శిక్షలు పడేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని, ఈ జంట హత్యల కేసులో నిందితులను హత్య జరిగిన 24 గంటలు గడవక ముందే గుర్తించి రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు. కేసును అత్యంత పారదర్శకంగా, లోతుగా దర్యాప్తు చేయడానికి విచారణ అధికారిగా డీఎస్పీ నీ అధికారిని నియమించినట్లు తెలిపారు. నిందితులను కోర్టు ద్వారా తిరిగి పోలీస్ కస్టడీలోకి తీసుకుని, అన్ని కోణాల్లో విచారించి పక్కా ఆధారాలను రికార్డు చేస్తామన్నారు. బాధితులకు న్యాయం జరిగేందుకు ఈ కేసులో నిపుణులైన అడ్వకేట్‌ను సహాయంగా నియమించామని, కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు పంపించి త్వరగా కేసును పరిష్కరింరించి నిందితులకు తొందరగా పెద్ద శిక్షలు పడేలా కృషి చేస్తున్నామని ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు డీఎస్పీలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ వేణు మాధవ్, స్థానిక తహసీల్దార్ వెంకన్న , సీఐ రామకృష్ణా రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఇతర మండల అధికారులు ,గ్రామస్థులు పాల్గొన్నారు.

## రేవంత్‌ను సీఎం చేయడమే రైతుల పాలిట శాపం

ఒవంత్‌ను సీఎం చేయడమే రైతుల పాలిట శాపంగా మారిందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నాణ్యత పరంగా బాగున్నాయని అన్ని సంస్థలు చెప్పిన తర్వాత కూడా, కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లను లిఫ్ట్ చేయడం లేదు. మూడేళ్ళుగా మేడిగడ్డ దగ్గర నీళ్లు లిఫ్ట్ చేయనందుకు రేవంత్ ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. రైతుల బాధలు పట్టకుండా, కమీషన్లు, దందాలలో వాటాల కోసం కాంగ్రెస్ నేతలు తమలో తాము కొట్లాడుకుంటున్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి సైన్యంలో పని చేసి వచ్చాడు, మరి ఆయనకు ఇంగితజ్ఞానం లేదా? నీళ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే.. ఉత్తమ్‌కు నీళ్లు లిఫ్ట్ చేయాలన్న కనీస మానవత్వం లేదా? ఓట్లేసిన పాపానికి ప్రజలకు ఇంత పెద్ద శిక్ష వేస్తారా? అన్నారు.

# మొక్కలు నాటడమే కాదు.. వాటిని సంరక్షించాలి

## పేటలో వన మహోత్సవాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక.

నారాయణపేట టౌన్, ఆగస్టు 25 మనసాక్షి :



పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ఒక కార్యక్రమంగా కాకుండా నిరంతర బాధ్యతగా భావించాలని సూచించారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్ర మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు గాయత్రి నగర్‌లోని మున్సిపాలిటీ లే అవుట్ ఖాళీ స్థలంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణం అందించాలంటే పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు వాటిని బతికించే బాధ్యతను కూడా తీసుకోవాలి అని అన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలో ఉన్న లే అవుట్ ఖాళీ స్థలాలను గుర్తించి, అందుబాటులో ఉన్న ప్రతి స్థలాన్ని పచ్చదనంతో నింపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు, రోడ్ల వెంట, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు, పాఠశాలలు, కళాశాలలు, ఇతర ప్రభుత్వ సంస్థల పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిర్దేశించిన ప్రదేశాలను గుర్తించి స్థానిక ప్రజలు, మహిళా సంఘాలు, యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి మొక్కను ఒక కుటుంబ సభ్యుడిలా భావించి సంరక్షించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. మొక్క నాటిన తర్వాత దానికి నీరు అందుతున్నదా? రక్షణ కల్పిస్తున్నారా? అది పెరుగుతున్నదా? అనే అంశాలను నిరంతరం పర్యవేక్షించాలి. మొక్కలు నాటిన సంఖ్య కంటే బతికిన మొక్కల సంఖ్యే మన విజయానికి కొలమానం కావాలి అని కలెక్టర్ స్పష్టం చేశారు. వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లాలో నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, పశువుల నుంచి రక్షణ కల్పించడం, అవసరమైన చోట ట్రీ గార్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. మహిళా సమాఖ్యలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మొక్కల ప్రాధాన్యతపై అవగాహన కల్పించి, వారు నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను వారికి అప్పగించేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పచ్చదనం పెరిగితే వాతావరణ సమతుల్యత మెరుగుపడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణం అందుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. వర్షపాతం, భూగర్భ జలాల పరిరక్షణ, జీవ వైవిధ్యం, గాలి నాణ్యత వంటి అంశాలపై చెట్లు ఎంతో ప్రభావం చూపుతాయని తెలిపారు. ప్రతి ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని అన్నారు. ఈ సందర్భంగా పట్టణ మహిళా సమాఖ్య సభ్యులు మెప్మా ఆధ్వర్యంలో రైస్ మిల్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రైస్ మిల్లు నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ శంకర్‌ను ఆదేశించారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, స్వయం ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మంజుల, వార్డు కౌన్సిలర్ భరత్, డీఆర్డీవో వెంకట్ రాములు, జిల్లా అటవీ శాఖ అధికారి గణేశ్, రేంజ్ అధికారి కమాలుద్దీన్, కౌన్సిలర్లు కల్పన, నాగమ్మ, ప్రభాకర్, రాము, డీటీసీపీవో కిరణ్, పర్యావరణ ఇంజినీర్ భరత్, మున్సిపల్ సిబ్బంది, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సుదర్శన హోమం వైభవంగా చక్రస్నానం



మేడ్చల్ మల్కాజిగిరి ఆగుష్టు 25 మనసాక్షి

ఆనంద్‌బాగ్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ సుదర్శన హోమం, మహాపూర్ణాహుతి, చక్రస్నానం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా ప్రధాన అర్చకులు ముడుంబై వేంకట రమణ చార్యులు, అర్చకులు డాక్టర్ తులసి వెంకట రమణ చార్యులు వేదమంత్రోచ్ఛారణల మధ్య సుదర్శన హోమాన్ని నిర్వహించారు. యాగశాలలో ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు చేపట్టి మహాపూర్ణాహుతి సమర్పించారు. అనంతరం శ్రీ సుదర్శన చక్రానికి శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. చక్రస్నాన కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తులు పవిత్ర చక్రస్నానాన్ని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం శ్రీ పుష్పయాగం, ద్వాదశారాధన, ధూపోత్సవం, డోలోత్సవం తదితర ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ముడుంబై వెంకట రమణ చార్యులు మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి కృపతో బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించామని, ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులందరికీ స్వామివారి అనుగ్రహం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఏబీ రవీందర్ రెడ్డి, క్లర్క్ సుధాకర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## టెక్నాలజీ సభా ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి




మదనపల్లె, ఆగస్టు 25 మనసాక్షి

అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి, ఐపీఎస్ రూపొందించిన వినూత్న 'కోర్టు మానిటరింగ్ సిస్టమ్' (సి ఎం ఎస్ ) కు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. జైపూర్‌లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన 'టెక్నాలజీ సభా ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026' ను ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సి ఎం ఎస్ వ్యవస్థ ద్వారా కోర్టు కేసులు, నిందితుల వివరాలు, కేసు స్థితి, సమన్లు, వారెంట్ల ప్రక్రియ పూర్తిగా డిజిటలైజ్ కావడంతో కేసుల విచారణ వేగవంతమై నేరస్థులకు సకాలంలో శిక్షలు పడుతున్నాయి.

## అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణా



రామసముద్రం, ఆగస్టు 25 మనసాక్షి

అన్నమయ్య జిల్లా జ్ఞాన జ్యోతి ఇయర్-2 అండ్ 3 లో భాగంగా ఫేస్-2 అంగన్‌వాడీ వర్కర్ల శిక్షణా కార్యక్రమం రామసముద్రం మండలం జడ్పీహెచ్‌ఎస్ రామసముద్రం నందు ఆగస్టు 22, 24, 25 తేదీలలో మూడు రోజుల పాటు నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి ప్రకాష్ రెడ్డి, కేశవ కుమార్, వెంకటస్వామి డి ఆర్ పి లుగా హాజరై అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ మూడు రోజుల శిక్షణలో సమ్మిళిత విద్య, చైల్డ్ రైట్స్, ఆర్టికల్ నెంబర్ 3 అండ్ 29, 65, 21 రకాల వైకల్యాల గురించి వివరించారు. అలాగే సమతుల ఆహారం మరియు పెరుగుదల పర్యవేక్షణ మధ్య గల సంబంధం, మంచి ఆహారపు అలవాట్లు, వివిధ రకాల విటమిన్స్, మినరల్స్, కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్, ఆయిల్స్ గురించి వివరించారు. పిల్లల రక్షణ మరియు సంరక్షణ మార్గదర్శకాలు, పిల్లల భద్రత, బాలల హక్కులు మరియు రక్షణ, మిషన్ వాత్సల్య, గ్రామ బాలల సంరక్షణ కమిటీ, పోషణ్ అభియాన్, డిజిటల్ ప్లాట్‌ఫార్మ్ గురించి, జెండర్ సెన్సిటైజేషన్, జెండర్ ఈక్వాలిటీ గురించి, అంగన్‌వాడీ సెంటర్లో నిర్వహించే అసెస్‌మెంట్ ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ వో ఆంజనేయులు, హెచ్ ఎం చిట్టిబాబు అంగన్వాడీ కార్యకర్తలు సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

## ఘనంగా వన మహోత్సవం

గుర్రంపోడు, ఆగస్టు 25, మన సాక్షి :

పర్యావరణ పరిరక్షణ, హరిత విప్లవమే ధ్యేయంగా మండల పరిధిలోని చేపూర్ గ్రామపంచాయతీ ప్రగతి పథంలో మంగళవారం గ్రామంలో పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో 'వన మహోత్సవం' (మొక్కలు నాటే కార్యక్రమం) అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా హార్టికల్చర్ అధికారి శేఖర్, మండల స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీఓ మహేష్, ఉపాధి హామీ ఏపీఓ కంచర్ల గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ మారపాక ఈశ్వరమ్మ కుమారుడు మారపాక నరేందర్, ఉప సర్పంచ్ ఏరుకొండ నర్సింహా, కుందూరు రాములు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. చేపూర్ గ్రామపంచాయతీ అభివృద్ధి సాధిస్తూ పచ్చదనంలో మండలంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులదేనని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. చేపూర్‌ను సుందరమైన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వినయ్, వార్డు సభ్యులు బుర్రి మహేష్, సీత చిన్న బాబు, కొమ్ము మహేష్, నిరసనమెట్ల సుదర్శన్, టీఏ యల్లయ్య, ఎఫ్ఏ అంబేద్కర్, గ్రామ పెద్దలు కొమ్ము హరికుమార్, నడ్డి మారయ్య, కొమ్ము ప్రభాకర్, పంచాయతీ సిబ్బంది వెంకటేష్, రవి, శ్రీను, రాజు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్' పథకం



నారాయణపేట టౌన్, ఆగస్టు 25 మనసాక్షి :

బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, వారి ఆర్థిక సాధికారతను పెంపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్' పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన బీసీ మహిళలకు కుట్టు మిషన్లు అందించి, ఇంటి వద్దనే కుట్టుపని చేసుకుంటూ స్వయం ఉపాధి పొందేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. పథకానికి అర్హత కలిగిన బీసీ మహిళల నుంచి ప్రస్తుతం ఆన్లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

**సెప్టెంబర్ 13 వరకు దరఖాస్తులు :**

ఆన్లైన్ దరఖాస్తుల నమోదు ప్రక్రియ సెప్టెంబర్ 13, 2026 వరకు కొనసాగుతుందని కలెక్టర్ వెల్లడించారు. అర్హులైన బీసీ మహిళలు ఎలాంటి ఆలస్యం చేయకుండా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను టీజీ ఓబి ఎంఎంఎస్. సి జి జి. జిఓవి. ఇన్ (స్రశీఎ-ఎఎం.ఎస్రస్ర.స్రశీజ.అఅ ) వెబ్సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు సమయంలో అవసరమైన వివరాలను తప్పులు లేకుండా నమోదు చేసి, నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన బీసీ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుట్టు మిషన్ ద్వారా ఇంటి వద్దనే ఉపాధి పొందడంతో పాటు కుటుంబ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు.

## వన మహోత్సవంతోనే పచ్చని భవిష్యత్తు



ఊర్కొండ, ఆగస్టు 25,మన సాక్షి

మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని కాపాడాలని ఊర్కొండపేట సర్పంచ్ అబ్దుల్ రషీద్ పిలుపునిచ్చారు. వన మహోత్సవం సందర్భంగా ఊర్కొండపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ సత్యపాల్ రెడ్డి హాజరై సర్పంచ్‌తో కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించడానికి చెట్లు ఎంతో అవసరమని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు పాఠశాలలోనే కాకుండా తమ ఇళ్ల వద్ద కూడా మొక్కలు నాటి వాటిని దత్తత తీసుకొని పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎల్ పిఓ దుర్గాప్రసాద్, ఎంపీడీఓ సత్య పాల్ రెడ్డి, ఎంపీఓ లక్ష్మణ్, ఏపిఓ నరసింహ, సర్పంచ్ అబ్దుల్ రషీద్ ఉప సర్పంచ్ రేపాని శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ఇబ్రాహీం, ఎంపీఓ, బుక్ కీపర్ మాధవి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ప్రజాప్రతినిధులు ,విద్యార్థులు పాల్గొన్నారు

## విద్యార్థులకు టైలు, బెల్టులు, ఐడీ కార్డులు, షూల పంపిణీ



వెల్దండ ఆగస్టు 25 మన సాక్షి:

చెర్కూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ బచ్చలికూర శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి బాలరాజ్ సహకారంతో టైలు, బెల్టులు, ఐడీ కార్డులు మరియు షూలను పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో, పరిశుభ్రంగా పాఠశాలకు హాజరై విద్యలో రాణించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు ఈ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దంతోజు మౌనిక, ఉపాధ్యాయురాలు కె. గీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల నిర్మాణానికి 10 గుంటల భూమిని కేటాయింపు




మహబూబ్ జిల్లా మన సాక్షి ఆగస్టు 25

నవాబుపేట్ మండలం కాకర్లపాడు గ్రామానికి చెందిన గడ్డమీది వెంకటయ్య , తండ్రి బుచ్చయ్య, ఆయన ఇష్టపూర్వకంగా సర్వే నంబర్ 49/3 లో ఉన్న భూమిని ప్రభుత్వం పాఠశాల నిర్మాణం కోసం 10 గుంటల భూదానం చేయడం జరిగింది ఈ భూమి కేటాయింపు ఎవరి బలవంతం లేదు నా ఇష్టపూర్వకంగా పాఠశాల కేటాయిస్తున్నానని ఆయన తెలిపారు అనంతరం నవాబుపేట్ ఎమ్మార్వో సురేష్, ఆర్ ఐ, రామాంజనేయులు, కు రాతపూర్వకంగా వినతి పత్రం అందజేశారు గ్రామస్తులు ఈ కార్యక్రమంలో ఎండి మహినోద్దీన్, వీరాంజనేయులు, నరసింహులు, మల్లేష్, పాల్గొన్నారు.